# ద్విపద

భార్య కాపురానికి వచ్చిన తర్వాత నరసింహంలో మార్పు కనిపించి తీరుతుందని ఆశించిన జానకమ్మగారికి ఆశాభంగం అయింది. ఆదివారం సెలవురోజు కనుక నరసింహం ఉదయం నుంచి ఇంట్లోనే ఉన్నాడు. తీరా అయిదు గంటలకు ముఖం కడుక్కుని షోగ్గా తయారై బజారుకు బయల్దేరాడు. ఈ చర్య గమనిస్తున్న జానకమ్మగారు కుర్రవాడు తను కోరుకున్న విధంగా మారుతున్నాడని భ్రమించింది. అతను బయల్దేరబోతుండగా ఆవిడగారు దార్లో నిలేసి అడిగింది. "ఏరా, నాయనా! స్టేషన్‌కేగా వెడుతున్నావూ?" అని. ఈ ప్రశ్న అనేక పర్యాయాలు ఆవిడ తనలో తాను వేసుకుని నరసింహం దగ్గిర్నించి రాగల జవాబును పరిపరివిధాల ఊహించుకుంది. కానీ ఆవిడ ఏ ఒక్క ఊహా నిజం కాలేదు.

నరసింహం ఆవిడ ప్రశ్నకు తుళ్లిపడి "స్టేషనుకా? ఎందుకూ? నేనట్లా బజారుకు వెడుతున్నాను!" అన్నాడు. అంటూనే తన దారిన తాను వెళ్లిపోయాడు.

జానకమ్మగారికి ఏమనుకోవాలో అర్థంకాలేదు. గుమ్మం పట్టుకుని అట్లానే నిర్నిమిత్తంగా నరసింహం వెడుతున్న దారివేపే చూస్తూ నించుంది.

నరసింహం మారడా? అని ఆమె తనలో తాను ప్రశ్నించుకుంది. ఎందుకు మారడూ, అది కాపురానికి వచ్చి కూచుంటే వాడే మారతాడు, ఎవరి అవసరం కనక? అని సమాధానం చెప్పుకుని సంతృప్తి పడింది. నరసింహం మారతాడా, లేదా అని ఆలోచించటం ఆమెకు ఈ మధ్య బొత్తిగా ఒక సమస్య అయి కూర్చుంది. నిమిషం తెరపి లేకుండా అదే ఆలోచన. కానీ ప్రత్యక్షంగా చూస్తేగానీ ఏదీ నిర్ధారించుకోలేక సమాధానం చెప్పుకుని మనసును సంతృప్తి పరచుకోవడం మిగిలేది!

ఇంతకూ అసలు విషయం ఏమంటే నరసింహం భార్య ఇవాళే కాపురానికి రాబోతున్నది. ఈ సాయంత్రం ఆరుగంటల బండిగి ఆ పిల్లను, తండ్రి తీసుకువచ్చి దిగవిడచి పోవటానికి అప్పటికి పదిరోజులకు ముందు నిర్ధారణయింది. ఈ విషయం నరసింహానికూడా తెలును. తెలిసినవాడు అట్లా నిర్వికార నిరంజనుడిలా ఎలా ఉన్నాడో జానకమ్మగారికర్థం కావటంలేదు. అసలామెకు ఏవీ అర్థంకాదు. నరసింహం అసలే అర్థంకాడు. వాడెందుకిట్లా తయారైనాడని ఆమె అనుక్షణమూ ప్రశ్న వేసుకుంటూనే ఉంటుంది; జవాబు దొరికే సాధనం లేదు కాని.

కావటానికి నరసింహం మంచివాడే. కాకపోయినా ఈ రోజుల్లో కాస్తో కూస్తో మంచివాళ్లు కానివాళ్లెవరు? నరసింహం దుర్మార్గుడు కాడు; పైగా చదువుకున్నవాడు. ఉద్యోగం చేస్తున్నవాడు. తన బాధ్యత తెలిసిన వాడూను! పోతే ఈ చివరి సంగతే ఆవిడకింకా నిర్ధారణ అవవలసి ఉంది.

నరసింహం ఏమీ పట్టించుకోడు, ప్రమాదం లేదు. కానీ తన స్వంత వ్యవహారం కూడా ఏమీ ప్రసక్తి లేనట్లు వ్యవహరిస్తే ఎలాగు? ఇదే ఆవిడ విచారం. ఇంత పరాకు మనిషి ఆత్మచింత – లేనివాడు ప్రపంచంలో ఎట్లా నెగ్గుకొస్తాడూ అని!

నరసింహం అన్నివిధాలా బుద్ధిమంతుడు అయినందుకు జానకమ్మగారికి వెనక మహాగర్వంగా ఉండేది. వాడు బి.ఏ. పరీక్ష పాసయ్యేవరకు ఆవిడకేమీ విచారం అనిపించలేదు. తరువాతయినా ఆవిడ అనుకోనివిధంగా అతను మారిపోయాడని కాదు, ఆవిడ ఆశించిన విధంగా మారాడు కాదు.

అంతవరకూ వాడు పుస్తకాల పరిధి దాటి ఇవతలకు రాలేదు; ఇందుకు జానకమ్మగారు సంతోషించింది. సహజమే. బి.ఏ. పాసయిన తర్వాత ఏం చెయ్యాలనేది ఒక ప్రశ్నగా నరసింహానికి అనిపించింది కానీ ఆమెకు అనిపించలేదు; బి.ఏ. అయ్యాక ఎం.ఏ. చదవటం రాజపథంగా ఆమెకు తోచింది. కారణం ఆమెకు తెలియదు కానీ చదువంటే అప్పటికి నరసింహానికి ముఖం మొత్తింది. ఇంక ససేమిరా కాలేజీ గుమ్మం తొక్కనన్నాడు. కొడుకు నెట్లాగయినా ఎం.ఏ. చదివించాలని ఆవిడ మహాప్రయత్నం చేసినా అందుకు సానుకూలపడే పరిస్థితి అగుపించలేదు; నరసింహం తండ్రి చెప్పిన మాట కూడా పెడ చెవిని పెట్టాడు. (ఆయనగారు అంత గట్టిగా తలుగజేసుకున్నదీ లేదు. జానకమ్మగారికి ఆయనమీద ఉండే కోపమల్లా ఇదే!)

నరసింహానికి ఇంకా పైకి చదవటానికి అభ్యంతరం ఏమిటో ఆవిడకు ఇప్పటికీ స్పష్టంగా తెలీదు. 'బి.ఏ.తో ఆపేసి ఏం చేద్దామని? అవకాశం ఉన్నప్పుడు వినియోగించుకోకపోతే ఎలాగ? చదువిట్లా అర్థాంతరంగా ఆపుచేస్తే లాభం ఏమిట్రా, అసలు నీ ఉద్దేశ్యం ఏమిటి?' అన్నది. దీనికి నరసింహం నోటితో ఏమీ సమాధానం చెప్పలేదు; చెప్పటం వాడికి చేతకాలేదు కావును, పాపం! నోటితో అయితే సమాధానం చెప్పలేదు. కానీ నరసింహం తను చెయ్యతలుచుకున్నది చేత్తో చూపించేశాడు. నాలుగు నెలలయినా ఖాళీగా కూచోకముందే రెండు వందలు నెలసరి ఆదాయం వచ్చే ఉద్యోగంలో జేరాడు. అయితే కొడుకు ప్రయోజకత్వానికి సంతోషించే ఛాన్సు ఆవిడకు లేకపోయింది. నరసింహం ఎం.ఏ. చదివి ఏం చెయ్యాలని ఆమె హృదయంలో ఉందో ఆమెకూ తెలీదు. కానీ చదవటానికి ఇంకేమీ మిగలకుండా చదివెయ్యటం బుద్ధికి మంచి లక్షణంగా అనిపించింది. చదువంటే డిగ్రీలే కాదని పాపం ఆవిడెరుగదు!

నరసింహం ఉద్యోగంలో ప్రవేశించటానిక్కూడా ఆవిడ అనేక ప్రశ్నలు వేసింది. "అసలు నీకు ఉద్యోగం ఏమిటి? ఉద్యోగం అన్నాక పగలూ, రాత్రీ ఒళ్లు కాల్చుకోవలసి వస్తుంది. ఆ ఉద్యోగంలో నీ పనేమిటి? జీతం శ్రమకు సరిపడుతుందా? ఉద్యోగంలో ఉండే ఇతర సదుపాయాలేమిటి?" అంటూ ఏకరువుపెట్టింది. వీటిలో కొన్నిటికి సమాధానాలు నరసింహానిక్కూడా తెలీవు. నరసింహం ఈ విషయంలోనూ తల్లిని తృప్తిపరచలేకపోయినాడు.

పోతే నరసింహం సంపాయించే డబ్బు ఏం చేయాలనేది కూడా ఆవిడకో సమస్య అయింది. ఏమంటే సరీగా ఒకటో తారీకు సాయంత్రం అయిదున్నర గంటలకు నరసింహం ఇంటికి వస్తూనే జేబులోంచి రెండు వందల రూపాయలూ బయటికి లాగి తల్లికందించాడు. అట్లా చెయ్యాలని వాడికెందుకు తోచిందో ఆవిడకు అర్థం కాదు, వాడు కేవలం తండ్రిని అనుకరించటంలేదు కదా!

"నాకెందుకురా నీ డబ్బా? నీదగ్గరే ఉంచు. అవసరం వస్తే అడుగుతాను!" అన్నది అందుకోకుండానే.

"ఆ పని నేనే చేస్తాలే! నీ దగ్గరే ఉంచు, ఎందుకైనా మంచిది!" అన్నాడు నరసింహం ఇంకేమనాలో తోచక.

"అట్లా కాదు, నాయనా! విను, పోనీ, ఆ డబ్బు నువ్వే నీ పేర బ్యాంకులో వేసుకో!"

"ఆ పనయినా నువ్వే చెయ్యి. ఒకే ఇంట్లో రెండు ఎకౌంట్లు దేనికీ?"

జానకమ్మగారు డబ్బు తీసుకోక తప్పింది కాదు. లెక్క చూసి, "అంతా నాకే ఇచ్చేశావేంరా, చేతి ఖర్చుకు ఏవీ దగ్గరుంచుకోకుండా?" అన్నది.

"నీ చేతిలో పడితే మళ్ళీ డబ్బు యివ్వవా ఏమిటి?" అంటూ నరసింహం వికారంగా నవ్వాడు.

"ఇందా, ఈ పాతికా ఉంచు!" అని జానకమ్మగారు నరసింహం జేబులో డబ్బు కుక్కి తతిమాది దాచింది.

ఎంత ఆలోచించినా ఇదంతా ఎక్కడా జరగని విపరీతమేననిపిస్తోంది కానీ మరేం కాదు.

"నరసింహం ఇంత అస్వతంత్రుడై పోతున్నాడేం?" అని బెంగ పట్టుకున్నదా ఇల్లాలికి. పదిసార్లు అడిగినా ఏమీ జవాబు చెప్పడు. తనకేవీ సంబంధం లేనట్లు వెళ్ళిపోతాడు. వీడికంటే తండ్రే లక్ష రెట్లు నయం అనిపిస్తోంది. ఆయనగారికయినా అంత అలక్ష్యం, పరధ్యాస, ఉద్యోగం ఊపిరి సలపకపోవటం వల్లా, ఆయన ప్రమేయం లేకుండా ఇంటి పనులన్నీ తను దీక్షతో జరిపించటంవల్లా కదా! ఆయనయినా మొదట్నుంచీ ఇట్లా లేరు. మరీ ఈ నరసింహానికి ఇప్పట్నుంచీ ఇంత పరాకేమిటి, ఇంత ఒంటిపిల్లి రాకాసితనమేమిటి?

నరసింహం ఇంట్లో కూరగాయలేం కావాలో కనుక్కోకపోతే ఆమెకింత విచారం లేదు, ఇంట్లో ఎవరికి ఏం బట్టలు కావాలో తెలుసుకోకపోతే యింత విచారం లేదు. కానీ, కనీసం తనకు సంబంధించిన విషయాలే ఎందుకు పట్టించుకోడు? వాడికి ఎన్ని చొక్కాలున్నాయో, ఎన్ని లాగూలున్నాయో ఎప్పటికప్పుడు తను చూచి జాగ్రత్త పడుతూండాలి. వాడికి ఎప్పుడు డబ్బు అవసరమో తనే కనిపెట్టాలి! వాడికి ఎన్నడూ సినిమా చూద్దామన్న ధ్యాస కలగకపోవటమేం; ఎన్నడూ పేపరు చూద్దామన్న బుద్ధి పుట్టకపోవటమేం?

ఆఖరుకు నరసింహం, తనకు భార్యగా ఎట్లాంటి పిల్ల కావాలనే విషయం కూడా విచారించనందుకు జానకమ్మగారికి తగని విచారం. అధమం వాడు తనకొక భార్య అవసరమనుకుంటున్నట్లు కూడా ఆమెకు తోచదు. ఉద్యోగంలో ప్రవేశించిన అర్నెల్లకు వీడికి పెళ్లి కూడా చేసేస్తే బాగుంటుందన్న ఊహ జానకమ్మగారికే ఒక దివ్య ముహూర్తాన కలిగింది. వెంటనే ఆమె భర్త దగ్గరికి వెళ్లి (అదృష్టవశాత్తూ ఆయన ఆ దివ్య ముహూర్తాన ఇంట ఉండటం కూడా శుభసూచనే!) సలహా చేసింది. ఆయన తల వంచకుండానే "దానికేం, చేసేద్దాం!" అన్నాడు.

"ఏమిటి చేసేద్దాం అంటున్నారు, నేను మన అబ్బాయి పెళ్లి మాట మాట్లాడుతున్నాను!" అన్నదీవిడ. "అయితే మట్టుకు అభ్యంతరం ఏమిటి? అలాగే కానిద్దాం!"

"కానిద్దాం అంటే చాలదు. మనవాడికి అన్నివిధాలా అనుకూలమైన పిల్లను వెదికి మరీ చెయ్యాలి!"

"ఆ శ్రమ మనం పడక్కర్లేదులేవే! వాడే ఎవర్నయినా ఎంచుక్కూర్చున్నాడేమో ఆ సంగతి కనుక్కో ముందు!" కనీసం ఈయనకైనా నరసింహం అంటే ఆమాత్రం విశ్వాసం ఉంది.

జానకమ్మగారు కొడుకును చూచాయగా అడిగింది. దానికి వాడేమీ జవాబు చెప్పలేదు. ఏ అమ్మాయి పేరు చెప్పినా తలొంచుకు ఉండి తన పని చేసుకుపోతూనే, "మీ ఇష్టం వచ్చినట్టే కానివ్వండి!" అనసాగాడు. జానకమ్మగారు ఈ జవాబుతో విసిగిపోయి ఒకనాడు హితబోధ చెయ్యసాగింది తీరిగ్గా; "నాయనా! ఇది కేవలం మా ముచ్చట కాదు. చేసుకునే వాడివి నువ్వు, సుఖపడవలసినవాడివి నువ్వు! ఈ కాలపు పిల్లల తీరు కనిపెట్టటం మా తరం కాదు. అందుకనే ఇన్నిసార్లు నొక్కి అడగాల్సి వస్తున్నది!"

ఇందుకూ నరసింహం ఏమీ మాట్లాడలేదు. తనకు కోడలుగా రాగల ఏ పిల్లతోనైనా భార్య సుఖాన్ని పొందటానికి నరసింహం సిద్ధంగా ఉన్నట్టు జానకమ్మగారు ఊహించుకున్నాక - ఆవిడ మనసుకు అనిపించిన మాట నిజమే కానీ ఈ క్షణంలో అందుకు చెయ్యగలిగింది ఏమీ లేదు. ఇంతవరకూ వచ్చిన తర్వాత నరసింహానికి సరితూగే భార్యను తీసుకొచ్చే భారం కూడా తనమీదే పడ్డందుకు జానకమ్మగారు విచారించి లాభంలేదని తేలింది. ఆమె వెంటనే తనకు తోచిన ఒక సంబంధం స్థిరం చేసింది. కట్నం కానుకల

విషయంలో కూడా నరసింహం నోరెత్తాడు కాదు. ఆపైన తల్లి చెయ్యమన్న పనికి వాడేమీ అభ్యంతరమైనా చెప్పలేదు.

నరసింహం ఒక ఇంటివాడైనాడు. కానీ ఇట్లా అస్వతంత్రుడైపోయాడేమిటి? అని జానకమ్మగారి విచారం.

చివరకు భార్య కాపురానికి రాబోతున్న రోజున కూడా ఇట్లా ప్రవర్తిస్తాడేమిటి? అని జానకమ్మగారు ఆలోచించటమయితే ఆలోచిస్తోంది కానీ జవాబు ఏం తోస్తుంది కనక? ఆ రాత్రి వాడు సరీగా ఎనిమిది గంటలకు ఇంటికి తిరిగి వచ్చాడు. భార్య వచ్చిన రెండు గంటవరకూ వాడు కనిపించకనేపోతే జానకమ్మగారి గుండె ఝల్లుమంటూనే ఉంది. ఇవాళ కూడా ఎందుకింత ఆలస్యం చేస్తాడూ అని మనసులో మధనపడ్డది. కానీ పైకి ఎవరితో ఏమనగలదు? ఇంటికి వస్తూనే నరసింహం మామూలు ప్రకారం తన గదిలో దూరి కూర్చున్నాడు. భార్య... తనకేం సంబంధం లేనట్లు కూచోటం ఆమెకు చిత్రంగా, విడ్డూరంగా అనిపిస్తున్నా, అంతకన్నా చైతన్యం నరసింహంలో కలగటంలేదు.

భోంచేసి ఇవతలకి వస్తుంటే నరసింహానికి భార్య ఎదురైంది. అతని నోటిమీదుగా ఏదో మాట బయటికి వచ్చినట్లు జానకమ్మగారికి వినిపించింది కానీ ఏదీ, ఆ ముఖంలో నవ్వు లేనే లేదేం? అని చిరాకెత్తింది.

నరసింహం భార్యతో కాపురం ఎట్లా చేస్తాడు? వాడికి ఏమిటా పరధ్యానం? తన భార్య సంగతే, తన సంగతే అంత అనవసరమేమిటి వాడికి? జానకమ్మగారు తనలో తాను ప్రశ్నలు వేసుకుంటోంది. నరసింహం జవాబులు చెప్పడు. ❃

*(ఆంధ్ర ప్రభ సచిత్ర-వార పత్రిక 15-6-55 & 20-9-99)*